6-1-2000

# ఖందహార్ మ్యూజింగ్స్...

'గ్లోబలైజేషన్' వేలంవెర్రి ఫలితంగా రాబోయే రోజులలో సాయుధ మిలిటెన్సీ బాగా పెరిగే అవకాశం ఉంది. కాబట్టి దానికి గల సామాజిక కారణాలను సమాజంలో చర్చకుపెట్టడం ఎంత ముఖ్యమో అది తీసుకునే అవాంఛనీయమైన రూపాలను విమర్శించడమూ ప్రజాతంత్రవాదులకు అంతే ముఖ్యమైన కర్తవ్యం అవుతుంది.



కె.బాలగోపాల్

సాయుధ పోరాటాల నేపథ్యంలో హక్కుల గురించి మాట్లాడడంలో రెండువైపులా ఇబ్బందులున్నాయి. ఖందహార్ హైజాక్ ఘటన కొత్త సంవత్సరం ముందు రాత్రి ప్రశాంతంగానే ముగిసింది గానీ, అది సాగుతున్నంతకాలం హైజాకర్ల మీద దుమ్మెత్తిపోయడం తప్పవేరే ఏ వ్యాఖ్యకూ సభ్య సమాజంలో చోటులేదు.

'వాళ్లు నూట ఎనభైమందిని చెరబట్టి ఛంపుతామంటుంటే నువ్వు దాని వెనుక వున్న సామాజిక రాజకీయ నేపథ్యాన్ని గురించి హేతుబద్ధంగా ఆలోచించాలంటావా' అని విరుచుకుపడడం ఏకైక దేశభక్తియుతమైన వైఖరిగా చలామణి అయింది.

నిజమే. వాళ్ల డిమాండ్లలోని తప్పొప్పులు ఎట్లాగున్నా వాటికి ఏరకంగానూ బాద్యులు కాని విమాన ప్రయాణీకులను, సిబ్బందిని పట్టుకొని 'మా కోరిక తీర్చకుంటే వీరినందరినీ చంపుతాం' అని బెదిరించడం తమది ఆషామాషీ బెదిరింపుకాదని రుజువు చేయడానికి కేవలం తలఎత్తిన పాపానికి ఒక ప్రయాణీకుడిని చంపడం అభిశంసనీయమైన ప్రవర్తనే.

కానీ అక్కడితో ఆపేద్దామంటే న్యాయం కాదు. న్యాయన్యాయాల దాకా ఎందుకు, అక్కడితో ఆగిపోయే ఆలోచన హైజాకింగ్ సమస్యకు ఆచరణాత్మకమైన పరిష్కారాన్ని కూడా ఇవ్వజాలదు. కానీ మన ఆలోచనలు ఆచరణాత్మకమైన పరిష్కారాల దగ్గర ఆగిపోవడానికి వీలులేదు. న్యాయన్యాయాల వివేచన చేయాలి, ఆ ప్రాతిపదికన పరిష్కారాలు ఆలోచించాలి.

ఇప్పుడు విడుదలయిన ముగ్గురు మిలిటెంట్లలో ఇద్దరు అయిదు సంవత్సరాలుగాను, ఒకరు ఆరు సంవత్సరాలుగాను జైలులో ఉన్నారు. వాళ్లమీద ఉన్న ఏ ఒక్క అభియోగంలోనూ విచారణ పూర్తి కాలేదు, శిక్షపడలేదు. కేవలం రిమాండులో జైలులో ఉన్నారు. బహుశా, జమ్మూ—కాశ్మీర్‌కు ప్రత్యేకమైన పబ్లిక్‌సేఫ్టీ ఆక్ట్ (పిఎస్ఎ) అనే 'నాసా' వంటి ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టంకూడ వారిపైన ప్రయోగించి ఉండవచ్చు.

ఈ ముగ్గురేకాదు, కాశ్మీర్‌లో వేలాది మంది ఈ రకంగా ఏ విచారణా లేకుండా సంవత్సరాల తరబడి జైలులో గడుపుతున్నారు. విచారణ వేగంగా జరిపి వారినేరాన్ని రుజువు చేయాలన్న ఆరాటం జమ్మూ—కాశ్మీర్ పాలకులు ఏ రోజూ ప్రదర్శించలేదు. చంపగలిగితే చంపేయడం, లేకపోతే తీవ్ర అభియోగాలు మోపి దీర్ఘకాలం జైలులో ఉంచడం వాళ్లు ఒక దశాబ్దకాలంగా అనుసరిస్తున్న పద్ధతి. మొన్నటి 5వ తేదీన ఆ రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన గణాంకాల ప్రకారం (నిన్న విడుదలయిన ముగ్గురిని కలుపుకొని) 398 మంది ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల కిందగానీ టాడా కింద గానీ చాలాఏళ్లుగా జైలులో ఉన్నారు.

అయినప్పటికీ వీళ్లు అదృష్టవంతులనే అనవచ్చు. ఎందుకంటె కాశ్మీర్‌లో భద్రతా సిబ్బంది చేతికి చిక్కిన 'మిలిటెంట్ల'ను జైలుకు పంపడం అరుదు. అధికార గణాంకాల ప్రకారమే 1990 నుండి ఈనాటి దాకా భద్రతా సిబ్బంది చేతిలో 14 వేల మంది మిలిటెంట్లు, పౌరులు చనిపోయారు. అనధికార లెక్కల ప్రకారం ఈ సంఖ్య 50 వేల దాకా ఉంటుంది. మిలిటెంట్లు ఎదురు కాల్పులలో చనిపోయినట్టు, పౌరులు రెండువైపులా జరిగిన కాల్పులలో ఇరుక్కొని చనిపోయినట్టు కాశ్మీర్ పాలకులు అంటారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లాగే కాశ్మీర్‌లో కూడా 'ఎన్‌కౌంటర్' అంటే పట్టుకొనిపోయి చంపడం, లేకపోతే అన్నంతింటున్నప్పుడో, నిద్రపోతున్నప్పుడో చుట్టుముట్టి చంపడం. ఈ 14 వేల మందిలో అత్యధికభాగం ఆ విధంగా చనిపోయినవారే.

చంపదలచుకోన్నప్పుడు తీవ్రమైన అభియోగాలుపెట్టి, టాడా ఉన్న రోజులలోనయితే టాడా కేసుపెట్టి, టాడా ఉన్నా లేకున్నా 'పాకిస్తాన్ నుండి ఆయుధాలు తెచ్చుకొని భారత ప్రభుత్వాన్ని కూలదోయడానికి యుద్ధం చేస్తున్నారు' అని కేసు పెట్టి జైలులో పడేస్తారు. అటువంటి కేసులలో బెయిలుఇచ్చే కోర్టు కాశ్మీర్‌లోనే కాదు, ఎక్కడా లేదుగానీ ఒకవేళ బెయిలు వస్తుందనుకుంటే ప్రివెంటివ్ డిటెన్షన్ వారంట్ జారీ చేసి సురక్షితంగా జైలులోనే ఉంచుతారు. 15 వేల మందిపైన ఇటువంటి కేసులుపెట్టారని ప్రభుత్వ గణాంకాలే చెప్తాయి. అయిదేళ్లో, ఆరేళ్లో గడచిన తరువాత ప్రభుత్వమే వారిని విడిచిపెట్టాలితప్ప వారు సాధారణ పరిస్థితులలో బయటికిరారు. ఈ నేరాలలో విచారణ, సాక్ష్యాలు, తీర్పు, అప్పీలు అనే తతంగమెప్పుడూ జరగదు. రిమాండు ఖైదీలుగానో డిటెన్యూలుగానో కొన్ని సంవత్సరాలు గడిపి ప్రభుత్వం విడిచిపెట్టధలచుకున్నప్పుడు వారు బయటికి పోవాలంటే ఆ దయకూడా చూపించడం అనవసరం అని ప్రభుత్వం భావించిన 'కరుడుగట్టిన' మిలిటెంట్లు బయటికేపోరు.

ఏ నేరమూ రుజువుకాకుండా ఏళ్లతరబడి బందీలుగా ఉంచడం ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రాలకూ భారత రాజ్యాంగానికీ వ్యతిరేకం. అయినా ఇది ఒక దశాబ్దంకాలంగా కాశ్మీర్‌లో అమలవుతూనే ఉంది. ఆ బందీలలో మరీ 'కరుడుగట్టిన' వారైతే జీవిత ఖైదీలే. వాళ్లను ఈ అక్రమమైన నిర్బంధం నుండి నిడిపించుకోవడానికి కిడ్నాప్‌లూ, హైజాక్‌లూ తప్పవేరే మార్గంలేదని వారి మిత్రులనుకున్నారంటే ఆశ్చర్యమేముంది?

ఈ మాటలు అనడంలో రెండురకాల ఇబ్బందులున్నాయి. ఏదో ఒక సమస్యపేరు చెప్పి దౌర్జన్యం చేసేవారిని వెనకేసుకొస్తున్నామని ఒకవైపు నిందించే వాళ్లుంటారు. నిజానికి హక్కుల ఉద్యమంమీద ఈ నింద ఎప్పుడూ ఉండేదే. మన నిత్యజీవిత భద్రతను భగ్నం చేసే వారికి ఆ పని చేయడానికి ఏవో కారణాలున్నాయని వివరించడం మనకు చాలావిసుగు, కోపం తెప్పిస్తాయి. 'నిత్యజీవిత భద్రత' అనే దాంట్లోనే అసమానత, అన్యాయం, వివక్ష ఉన్నప్పుడు అది అప్పుడప్పుడు భగ్నంకాక తప్పదనీ ఆ ప్రయత్నాలను కొంచెం సానుభూతితో అర్థం చేసుకోవాలనీ చెప్తే రుచించకపోవచ్చును గానీ చెప్పకతప్పదు.

అవతలివైపు తమ పోరాటం న్యాయమైన సమస్యల నుండి పుట్టిందని గుర్తించిన తరువాత తాము ఏంచేసినా అది న్యాయమేనని గుర్తించాలని పోరాటకారులంటారు. కానీ నిజానికి విమానంలోవున్న 180 మంది ప్రాణాలు జైలులో ఉన్న 398 మంది స్వేచ్ఛకు సమానమా? ఎక్కువా? తక్కువా? వీళ్ల నిర్బంధానికి వాళ్లు ఏ రకంగానూ బాధ్యులుకారు. వాళ్లమెడమీద తుపాకులుపెట్టి వీళ్లను విడిపించుకోవడం, విడిచిపెట్టకపోతే వాళ్లను చంపడానికి సిద్ధపడటం ఏ విధంగా న్యాయం? ఒకవేళ భారత ప్రభుత్వం లొంగకపోతే విమాన ప్రయాణీకులను చంపుతామన్న బెదిరింపును హైజాకర్లు నిలబెట్టుకోవడానికి ప్రయత్నం చేయకతప్పేది కాదుకదా? ఒక్క ప్రాణంపోయినా అది సమరనీయమై ఉండేదా? ఈ ప్రశ్నలు వేస్తున్నామంటేనే కాశ్మీర్‌లో అమలవుతున్న నిర్బంధాన్ని చూడడానికి నిరాకరిస్తున్నామనీ, ప్రభుత్వ నిర్బంధాన్ని పరోక్షంగా సమర్థిసున్నామనీ హర్కత్ ఉల్ ముజాహిదీన్ మిలిటెంట్లు నిందించవచ్చునుగానీ న్యాయన్యాయాల వివేచన ప్రాతిపదికన చేసే ఆలోచనకు ఈ ప్రశ్నలు తోచకతప్పదు.



చాలా బాధాకరమైన విషయమేమిటంటే కాశ్మీర్ ప్రజల సమస్య ఒకసారి కార్గిల్ యుద్ధం రూపంలోనూ ఒకసారి ఖందహార్ హైజాక్ ఘటన రూపంలోనూ వేరే ఏదో ఘర్షణగా వార్తలకెక్కుతుందిగానీ కాశ్మీర్ ప్రజల సమస్యగా అదెప్పుడూ చర్చకురాదు. ఇప్పుడు విడుదలయిన మౌలానా మసూద్ అజహర్ హర్కత్ ఉల్ ముజాహిదీన్ నాయకుడు. అది హర్కత్ ఉల్ అన్సార్ కొత్త పేరు. పాత పేరుగల సంస్థను అమెరికా 'టెర్రరిస్టు సంస్థల' జాబితాలోకి చేర్చిన తరువాత ఆ సంస్థ తన పేరు మాత్రం హర్కత్ ఉల్ ముజాహిదీన్‌గా మార్చుకుంది. దాని లక్ష్యాలు మాత్రం మారలేదు. ముస్లింలు ఎక్కడున్నా ఇస్లామిక్ రాజ్యంలోనే ఉండాలన్నది వారి ప్రగాఢ నమ్మకం. ఆ నమ్మకాన్ని అమలుచేయడానికి చెచెన్యా నుండి కాశ్మీర్ దాకా హర్కత్ మిలిటెంట్లు పోతుంటారు. దురదృష్టమేమిటంటే ఈ కారణంగా, చాలా సున్నితమైన సాంఘిక, సాంస్కృతిక కారణాలున్న ఆ పోరాటాలకు ముస్లింమతోన్మాదం రంగు అంటుకుంది. ఇస్లామిక్ మిలిటెంట్లను కాశ్మీరీలూ చెచెన్ ప్రజలూ ఆహ్వానించకపోలేదుగానీ దానికి ప్రధాన కారణం భావసారూప్యం కాదు. చెచెన్యా సంగతేమోగానీ కాశ్మీరీలలో మతోన్మాదం ప్రభావం తక్కువే. అయినప్పటికీ భారత్ మీద వేయడానికి ఒక రాయిగా హర్కత్ ఉల్ అన్సార్‌నూ హిజ్బుల్ ముజాహిదీన్‌నూ లష్కర్—ఇ—తొయిబాను కాశ్మీరీలు ఆదరించడం పెద్దగా ఆశ్చర్యం కలిగించే విషయంకాదు.

కానీ ఆ సంస్థలలో ఉన్నది ఎక్కువగా పాకిస్తానీ ఆఫ్ఘానీ జాతీయులయిన ముస్లిం మతోన్మాదులు. ఇప్పుడు 'కాశ్మీర్ పోరాటం' ప్రధానంగా వారి చేతిలో ఉంది. కాశ్మీరీలు తమ జాతి, జీవనవిధానం, సంస్కృతుల రక్షణ కోసం చెందే ఆరాటం ఎంతమాత్రం చల్లారలేదు. దానికి ఏం చేయాలో పాలుపోక ముస్లిం మతవాదులు తమ సంకుచితమైన అజెండాలోకి దానిని ఇరికించే ప్రయత్నం చేస్తుంటే కాశ్మీరీలు తెలిసీ వారిని ఆదరిస్తున్నారు. యాభై ఏళ్లుగా కాశ్మీరీలకు భారత్ చేసిన అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఇది సానుభూతితో అర్థం చేసుకోగల వైఖరే. అయినప్పటికీ దాని పర్యవసానాలను చూసినప్పుడు ఇది చాలా దురదృష్టకరమైన వైఖరని అనిపించక తప్పదు.

ఎందుకంటే కాశ్మీరీల న్యాయమైన జాతీయ అకాంక్షలను చాలా అన్యాయంగా అణచివేసిన రోజులలో భారత ప్రభుత్వానికీ దాని విధానాలకూ కొరవడిన నైతిక సాధికారత ఇప్పుడు అయాచితంగా లభించింది. భారత్ ఇప్పుడు 'ముస్లిం తీవ్రవాదాన్ని' ఎదుర్కొంటున్న లౌకిక రాజ్యంగా కనబడగలుగుతున్నది. ప్రపంచదేశాల సానుభూతి పొందగలుగుతున్నది.

మొదట కార్గిల్ యుద్ధం, ఆ తరువాత ఖందహార్ హైజాక్ ఘటన కాశ్మీర్ సమస్య నుండి కాశ్మీరీలను మరింత వెనక్కినెట్టేసి లౌకిక భారత రాజ్యానికీ హర్కత్ ఉల్ అన్సార్ (ఉరఫ్ ముజాహిదీన్) మతోన్మాదానికీ మధ్యనున్న 'పోరాటాన్ని' మరింత ముందుకు తెచ్చింది. మొదటిదశలో భౌతిక విజయం భారత రాజ్యానిదే అయినా నైతిక విజయం కాశ్మీరీలది అయినట్టే. రెండవ దశలో అంటే ఈ రోజు, ఇంకా రాబోయే రోజులలో —భారత రాజ్యానికి భౌతిక విజయం కష్టతరం కావచ్చునుగానీ నైతిక విజయం సులభంగా లభించేసింది. అది కాశ్మీరీల ఆరాటానికి చాలాచాలా నష్టకరం. అమాయకుల ప్రాణాలను పణంగాపెట్టి తమవారి విడుదల కోరుకునే హర్కత్ —ఉల్ —ముజాహిదీన్ మిలిటెంట్ల హైజాకింగ్ చర్య ఈ నష్టాన్ని మరింత ఎక్కువ చేసింది.

ఈ మాటలు అనడం పరోక్షంగా భారత రాజ్యం అనుసరిస్తున్న అణచివేత విధానాలను సమర్థించడమేననీ ఈ హింస వెనక కాశ్మీర్ సమస్యఒకటి ఉందని చూడడానికి నిరాకరించడమేననీ హర్కత్ మిలిటెంట్లూ, మేధావులూ అంటే అనవచ్చునుగాక, కాశ్మీరీల మంచికోసమే ఈ మాటలు అనకతప్పదు. 'గ్లోబలైజేషన్' వేలంవెర్రి ఫలితంగా రాబోయే రోజులలో సాయుధ మిలిటెన్సీ బాగా పెరిగే అవకాశం ఉంది. కాబట్టి దానికి గల సామాజిక కారణాలను సమాజంలో చర్చకుపెట్టడం ఎంత ముఖ్యమో అది తీసుకునే అవాంఛనీయమైన రూపాలను విమర్శించడమూ ప్రజాతంత్రవాదులకు అంతే ముఖ్యమైన కర్తవ్యం అవుతుంది. మొదటి కర్తవ్యానికి రాజ్యం నుండి, రెండవ కర్తవ్యానికి మిలిటెంట్ల నుండీ వారి రాజకీయ సానుభూతిపరుల నుండీ ఎంత వ్యతిరేకత అయినా రావచ్చును గాని, ప్రజలశ్రేయస్సు దృష్ట్యా ఈ పనిచేయడంఅవసరం.

ప్రస్తుత విషయానికొస్తే, జమ్మూకాశ్మీర్ జైళ్లలో చాలాకాలంగా మగ్గుతున్న వారిపైన కనీసం ఇప్పటి నుండి 90 రోజుల వ్యవధిలో నయినా,చార్జిషీట్లు పెట్టి వేగంగా విచారణ ముగించాలనీ, అభియోగం చాలనప్పుడు ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాలు ప్రయోగించే అక్రమ పద్ధతిని విడనాడాలనీ భారత రాజ్యాన్ని డిమాండ్ చేయవలసిన్న అవసరం ఉంది. మళ్లీ హైజాక్‌లు జరగకుండా చూడాలని నిజంగా మనపాలకులు కోరుకుంటుంటే ఈ పనిచేయాలి.